ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శనివారం 7 సెప్టెంబరు 2024

100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

డీసీఎం వాహనం సీజ్, ఒకరిపై కేసు నమోదు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 6 : భూపాలపల్లి జిల్లా నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. భూపాలపల్లి పట్టణం బాంబులగడ్డ సమీపంలో ఎస్సై సుధాకర్ నేతృత్వంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా డీసీఎం

మిగతా 8వ పేజీలో...

వరద బాధితులను ఆదుకుంటాం
మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్
రాంపూర్, మల్లకట్ల గ్రామాల్లో పర్యటన
వివరాలు 8వ పేజీలో

తొలి పూజకు వేళాయె

నేడు వినాయక చవితి

- కొలువు దీరనున్న గణనాథులు
- జోరుగా గణపతి విగ్రహాల విక్రయాలు


ములుగులో వినాయక విగ్రహాలు

భూపాలపల్లిటౌన్/ములుగు, సెప్టెంబరు 6: విఘ్నాలను తొలగించే గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల ప్రజలు సిద్ధమయ్యారు. ఊరూరా, వాడవాడలా మండపాలు, పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలలు, తోరణాలతో అలంకరిస్తున్నారు. శనివారం నుంచి తొమ్మిది రోజులపాటు పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు సన్నద్ధమయ్యాయి. దీంతో ఎక్కడ చూసినా పండగ వాతావరణం నెలకొంది. వినాయక విగ్రహాల అమ్మకాలు జోరందుకున్నాయి. జిల్లా కేంద్రాలతో పాటు ఆయా మండల కేంద్రాలలో కళాకారులు తయారుచేసిన తీరొక్క విగ్రహాలు ఆకర్శిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు వాహనాల ద్వారా తమ గ్రామాలకు తరలిస్తున్నారు. శనివారం ఉదయం తొలిపూజ చేసి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా దేవాలయాల్లోనూ నవరాత్రి వేడుకలు జరగనున్నాయి.

భూపాలపల్లి పట్టణంలో ప్రతి కాలనీలో రెండు నుంచి మూడు వినాయక మండపాలు వెలిశాయి. రెండు రోజుల ముందు నుంచే మండపాలను అలంకరిస్తున్నారు. ఈ మండపాలలో వినాయకుడికి ప్రతిష్ఠించి నవరాత్రులు భక్తి శ్రద్ధలతో కొలుస్తారు.

పర్యావరణ హితమైన మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని అధికార యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా పోలీసు అధికారులు సూచనలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. వినాయక విగ్రహాలకు ఈసారి ధరలు విపరీతంగా పెరిగాయి. రూ.4వేల నుంచి రూ.30వేల వరకు పలుకుతున్నాయి. అయినా భక్తులు కొనుగోలు చేస్తున్నారు.


ములుగులో గణపతి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న భక్తులు


భూపాలపల్లిలో వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న భక్తులు

నష్టం అంచనాలకు తక్షణమే చర్యలు చేపట్టాలి

- అడవిలో జరిగిన విపత్తును కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్తాం
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- బీజేపీ నేతలతో కలిసి ములుగు జిల్లాలో పర్యటన

వివరాలు 7లో..


పస్రా శివారులో దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 6: అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ, ఉద్యానశాఖ, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ రైతు రుణమాఫీ కానీ కుటుంబ సభ్యుల గ్రూపింగ్, వ్యవసాయ రుణాల రెన్యూవల్, ఎరువులు, పామాయిల్ పంట సాగు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ రైతు రుణమాఫీ జరగని లబ్ధిదారుల కుటుంబ సభ్యుల గ్రూపింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 32,009 మంది రైతులకు మూడు విడతల్లో రూ.203.91 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీ కాని రైతులు 4,156 మంది ఉన్నారని, కుటుంబ సభ్యుల సమాచారం లేనందున సంబంధిత రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. ఆధార్ సంబంధిత సమస్యలతో కొంత మంది రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. ఇప్పటి వరకు 2వేల మంది రైతుల విచారణ పూర్తి అయ్యిందన్నారు. మిగిలిన రైతుల గ్రూపింగ్ ప్రక్రియను ఈనెల 10 వరకు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో 65 శాతం మంది రైతులకు రుణాల రెన్యూవల్ అయ్యాయన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్న కలెక్టర్ 3,896 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.

ఇంకా 4వేల టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. జిల్లాలో 2వేల ఎకరాల్లో ఆయిల్‌పాం లక్ష్యం కేటాయించగా ఇప్పటి వరకు 1,024 ఎకరాలను గుర్తించి 203 ఎకరాల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, డీఏఓ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- ములుగు కలెక్టర్ దివాకర


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 6: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ టీఎస్.దివాకర వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం ములుగులోని కలెక్టరేట్ చాంబర్‌లో ఆయన వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రతి వ్యాధి ఏ ప్రాంతంలో ఎక్కువగా నమోదు అవుతుంది, దానికి గల కారణాలను తెలుసుకోవాలన్నారు. ప్రతి మెడికల్ ఆఫీసర్ విధులకు సక్రమంగా హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు పవన్‌కుమార్, శ్రీకాంత్, రణధీర్, భవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.


సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా


యువతి పోగొట్టుకున్న ఫోన్‌ను అందిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్‌క్రైం, సెప్టెంబర్ 6: సెల్ యజమానులు తమ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అందిన ఫిర్యాదుల మేరకు సీసీఎస్‌పోలీసులు పట్టుకున్న సెల్‌ఫోన్‌లను శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతులమీదుగా అందచేశారు. ఈ సందర్బంగా సీపీ మాట్లాడుతూ.. దొంగతనం జరిగినా, పోగొట్టుకున్న ఫోన్ల ఆచూకీ తెలుసుకునేందుకు సీసీఎస్‌తోపాటు ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 7,427 సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదులు రాగా, 3,998 గుర్తించి అందులో 2,846 ఫోన్లను యజమానులకు అందజేశామన్నారు. ఈ వారం రోజుల్లో 102 ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన అన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే నంబర్ బ్లాక్ చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ అబ్బయ్య, ఐటీ కోర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





ఐక్య ఉద్యమాలతోనే బీసీ హక్కుల సాధన

- డిక్లరేషన్ అమలు కోసం ఉద్యమం
- వివిధ పార్టీలు, సంఘాల పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

వడ్డెపల్లి, సెప్టెంబరు 6: ఐక్య ఉద్యమాలతోనే బీసీ హక్కుల సాధన సాధ్యమవుతుందని, కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం మహా ఉద్యమం, మరో పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆల్ పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నేతలు, వక్తలు పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జిల్లాల ఫూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతి కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు, సమగ్ర కులజనగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం జరిగే ఉద్యమంలో బీఆర్ఎస్ ముందుంటుందన్నారు. మహాత్మాజ్యోతిరావుపూలే చూపిన మార్గంలో బహుజన హక్కుల కోసం ఎన్నో పోరాటాలు జరిగిన వరంగల్‌లో తెలంగాణ ఉద్యమం వల్ల వెనక్కి తగ్గారని అన్నారు. తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో బీసీ హక్కుల సాధన ఉద్యమం చేయాలని బీసీ సమాజానికి పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ.. సకల సామాజికరంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా కోసం జరిగే పోరాటంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ ముందు నడుస్తుందని స్పష్టం చేశారు. చట్ట సభల్లో బీసీ వాటా కోసం రాష్ట్రంలో 400 కిలోమీటర్ల పాదయాత్ర చేశామని తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో పొందుపర్చిన అంశాలను సాధించడం కోసం పూలే, బీఆర్ అంబేద్కర్, పేరియార్ రామస్వామి, కొండా లక్ష్మణ్‌బాపూజీ వంటి మహనీయుల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చిరుతల కక్షి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ వైస్ చైర్మన్ పటేల్ వనజ, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఎం నేత తిరుపతి, టీడీపీ నేత అర్షనపల్లి విద్యాసాగర్‌రావు, ప్రజా సంఘాల నాయకులు దారం జనార్ధన్, కేడెల ప్రసాద్, గొల్లపల్లి వీరస్వామి, సోమా రామమూర్తి, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, చింతకింది కుమారస్వామి, సారంగపాణి, గురిమిళ్ల రాజు, చింతం ప్రవీణ్‌కుమార్ కొండ్ర నర్సింగరావు, చుంచు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రూ.27 క్వింటాళ్ల రైస్ స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 6: హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేటలో రూ.71వేల విలువ కలిగిన 27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్.యుగంధర్ అనే వ్యక్తి అమ్మవారి పేటలో తన కోళ్లఫామ్‌లో నిల్వ ఉంచిన పీడీఎస్ రైస్‌ను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం యుగంధర్‌ను మడికొండ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రవికుమార్ ధ్రువీకరించారు.

9న వరంగల్ నగరానికి సీఎం

బాలసముద్రం, సెప్టెంబరు 6 : సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 9న వరంగల్ నగరానికి రానున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 9 తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ఆర్ట్స్ కాలేజీకి చేరుకుంటారన్నారు. నయీంనగర్ బ్రిడ్జిని, కాళోజీ కళాక్షేత్రంకు ప్రారంభిస్తారన్నారు.

చాక్‌పీసులపై వినాయకుల చిత్రీకరణ



చెన్నారావుపేట, సెప్టెంబరు 6: మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ ఉపాధ్యాయురాలు కాచ వరపు సంధ్య చాక్‌పీసులపై వినాయక దేవుళ్లను శుక్రవారం చిత్రీకరణ చేశారు. తన మైక్రో ఆర్టిస్టుతో వినాయక దేవుళ్ల చిత్రంతో పాటు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించండి.. ఏకో ఫ్రెండ్లీ గణేష్, జై గణేష్.. అనే నినాదాలను చాక్‌పీసులపై చిత్రీకరించారు. ఈ సందర్బంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంధ్యను సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్‌రెడ్డిలో పాటు పలువురు ఉపాధ్యాయులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడి రమేష్ గౌడ్, కృష్ణమోహన్, వల్ల వేణు, భద్రు, వైనాల రాజు, జున్నూతుల కవిత, బొజ్జ స్వప్న, కుండె రోజారాణి, సృజన, పొగాకుల రోజా, కేతిడి గౌతమి, దొంతి స్రవంతి, లక్క శ్రావణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.





ఎంజేపీ ఆర్‌సీవోగా రాజ్‌కుమార్ నియామకం


వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6: మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను ఎం.రాజ్‌కుమార్‌కు అప్పగిస్తూ ఎంజేపీటీ గురుకులాల కార్యదర్శి బి.సైదులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఆర్‌సీవో వై.మనోహర్‌రెడ్డి అనారోగ్య కారణాలతో తనను రీవోక్ చేయాల్సిందిగా కోరడంతో రాజ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు సెక్రెటరీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా రాజ్‌కుమార్.. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని ఎంజేపీటీ బాయ్స్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6: ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో నాలుగో దశ ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.చందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 ఉదయం 11గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని రోజువారి మెరిట్ ప్రాతిపదికన మాత్రమే సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ఈ నెల 11 నుంచి 20 వరకు ప్రతీ రోజు సంబంధిత ఐటీఐలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6: ఆయనో ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన పేరు గౌరిశెట్టి రాజన్న గెజిటెడ్ హెడ్మాస్టర్. అయితేంటని అంటారా...? హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రం వాసి అయిన ఈయన తండ్రి గౌరిశెట్టి గోవర్దన్ ఇక్కడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించారు. తర్వాత గౌరిశెట్టి రాజన్న ఇదే పాఠశాలలో చదుకున్నారు. ఇప్పుడు అదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇంతే కాదు.. రాజన్నకు ముగ్గురు సంతానం ఇదే పాఠశాలలో విద్యను అభ్యసించడం విశేషం. వంశీధర్, శాంతిప్రియ, సాయికృష్ణలు ఇక్కడే చదువుకున్నారు. తాను చదువుకున్న పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడు అయిన రాజన్న దాతల సహాయంతో పాఠశాల చుట్టూ ప్రహరీగోడతో పాటు గేటను ఏర్పాటు చేశారు. కాగా, ఈయన ప్రభుత్వానికి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు కోసం దరఖాస్తు చేసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వమే రాష్ట్రంలోని ఇలాంటి సేవలు అందించిన వారికి ప్రత్యేకంగా ఫోర్‌రన్నర్స్ పేరుతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కారం అందజేస్తారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గురుపూజోత్సవంలో గౌరిశెట్టి రాజన్నను ఉత్తమ ఉపాధ్యాయుడి సత్కారంతో గౌరవించారు.


హనుమకొండ నడిబొడ్డున ఉన్న పద్మాక్షిగుట్ట చుట్టూ విరివిగా వెలసిన నిర్మాణాలు


వరంగల్ బస్‌స్టేషన్ సమీపంలోని గోవిందరాజుల ఆలయం చుట్టూ నిర్మితమై ఉన్న భవనాలు, నిర్మాణాలు

దేవుడి మాన్యాలనూ దోచేశారు!

● వరంగల్ నగరంలో యథేచ్ఛగా ఆలయాల భూములు కబ్జా ● 17 ఆలయాలకు చెందిన 350ఎకరాల హాంఫట్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల రాజధానిగా వెలుగొందిన వరంగల్‌లో అనేక పుణ్యక్షేత్రాలున్నాయి. అంతేకాదు కాకతీయులకు పూర్వం నిర్మించిన ఆలయాలు కూడా ఎన్నో ఉన్నాయి. భద్రకాళి ఆలయం, వెయ్యి స్తంభాల గుడితో పాటు పద్మాక్షిమాత ఆలయం, సిద్ధేశ్వరాలయం, జలేశ్వరాలయం, ఎర్రగట్టు లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం, మెట్టుగుట్ట రామలింగేశ్వరాలయం, శ్రీరంగనాయక ఆలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు అనేక ఆలయాలకు నిలయం వరంగల్. ఈ చారిత్రత్మక ఆలయాల పోషణ కోసం పూర్వమే ఎకరాలకొద్ది భూములను కేటాయించారు. టెంపుల్ సిటీగా వరంగల్ మహనగరం అభివృద్ధి చెందుతున్న క్రమంలోనే కబ్జాకోరులు ఆయలయాల మాన్యాలపై కన్నేసి దోచేస్తున్నారు. దీంతో వందల ఎకరాల భూములు మాయమవుతున్నాయి.

కబ్జా కోరల్లో ప్రముఖ ఆలయాల భూములు

వరంగల్ మహనగరంలో వెయ్యికి పైగా ఆలయాలున్నాయి. దేవాదాయశాఖ పరిధిలో ఉన్న ఆలయాలతో పాటు స్థానికులు నిర్మించుకున్న ఆలయాలు, ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న దేవాలాయలున్నాయి. వీటిలో అనేక ప్రముఖ ఆలయాలు దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్నాయి. అయితే దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న అనేక ఆలయాల భూములు కబ్జాలకు గురవుతున్నాయి. ప్రధానంగా హనుమకొండ పట్టణ నడిబొడ్డున ఉన్న పద్మాక్షిమాత ఆలయ భూములను దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఈ ఆలయానికి సంబంధించి సర్వే నెంబర్లు 901, 902, 903, 904, 905, 906, 535, 890/బీ, 880లలో మొత్తం 72.23ఎకరాలున్నాయి. వీటిలో 8.20ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. ఇందులో ఆరుగురు ప్రముఖులు దేవాలయ భూమిని అక్రమించుకుని దర్జాగా ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. ఈ అక్రమాలపై విచారణ జరిపిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చేతులెత్తేశారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే పద్మాక్షి గుట్టకు సంబంధించిన 78.30ఎకరాల భూములు ఉండగా, ఈ భూములను పోరంబోకుగా మార్చారు. వీటిలో సుమారు 18ఎకరాలకు పైగా కబ్జాకు గురైంది. అలాగే హనుమకొండలోని సిద్దేశ్వరాలయానికి సంబంధించిన సర్వే నెం.882లో 24.03ఎకరాల భూమి ఉంది. ఇందులో 9గుంటల స్థలం ప్రముఖ విద్యాసంస్థల యాజమాని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. అలాగే కాజీపేటలోని మెట్టుగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ భూములు 59.07ఎకరాలు ఉండగా 1.39ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. అలాగే మాత మునులపాటి వీరపిచ్చమాంబ పీఠంకు చెందిన సర్వే నెం. 879లో 1.14ఎకరాల భూమి ఉండగా, 10గుంటల భూమిని ఆరుగురు ఆక్రమించుకున్నట్టు దేవాదాయశాఖ గుర్తించింది.

హన్మద్గిరి రంగనాయకస్వామి ఆలయం (పెద్ద కోవెల) సర్వే నెం.552, 592/1, 807లలో 13.34 ఎకరాల భూమిలో 9.13ఎకరాల భూమిని 34మందికి పైగా ఆక్రమించుకుని పక్కా ఇళ్లు, భవనాలు నిర్మించుకున్నారు. వరంగల్ మట్టెవాడలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి 4.21ఎకరాల భూములున్నాయి. ఈ భూముల్లో 1.11ఎకరాలను ఆక్రమించుకుని విద్యాసంస్థలు, పంక్షన్‌హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించుకున్నారు. అలాగే వరంగల్ గోవిందరాజుల గుట్ట మొత్తం 5.25ఎకరాల్లో విస్తరించి ఉండగా సుమారు 2.25ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. వరంగల్ రామన్నపేటలోని శ్రీమల్లికార్జునస్వామి (కుంటిభద్రయ్య) గుడికి 10ఎకరాల భూమి ఉంటే 8.10ఎకరాలు ఆక్రమణకు గురైంది. అలాగే రంగంపేటలోని హనుమాన్ గుడి5.38ఎకరాల భూమి ఉంటే మొత్తం భూమి స్వాహా చేశారు. అలాగే ఖిలా వరంగల్‌లోని స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయానికి 3.09ఎకరాల భూమి ఉంటే 33గుంటల భూమిని కబ్జాకోరులు అక్రమించారు. దేశాయిపేటలోని శ్రీరంగనాయకస్వామి ఆలయానికి చెందిన 19.19ఎకరాల భూములు ఉంటే 7.35ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయి. రంగాశాయిపేటకు చెందిన శ్రీసీతారామచంద్ర ఆలయానికి 22.29ఎకరాల భూములు ఉండగా, వీటిలో విలువైన 554.15చదరపు గజాల స్థలం అక్రమణకు గురైంది.

హనుమకొండ జిల్లా మడికొండలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి చెందిన 470.34ఎకరాల భూములు ఉంటే, వాటిలో 264.34ఎకరాల భూములను స్వాహ చేశారని దేవాదాయశాఖ గుర్తించింది. అలాగే హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన 12.30ఎకరాల భూములు ఉండగా, 3.06ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. హనుమకొండలోని జగదీష్‌మందిర్‌కు చెందిన 15.21ఎకరాల భూములన్నీ స్వాహా చేశారు. హనుమకొండ రాగన్నదర్వాజలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన 4.33ఎకరాల భూములు ఉండగా, వీటిలో 1.38ఎకరాల అత్యంత విలువైన భూములు కబ్జాకు గురయ్యాయి. మడికొండలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన 9.04ఎకరాల భూముల్లో 1.36ఎకరాల భూములను మాయం చేశారు. వీటితో పాటు వరంగల్‌లోని భోగేశ్వరాలయం, దుర్గేశ్వరాలయం, రాజ్‌పుత్ కాలనీలోని రామాలయం, హనుమకొండలోని శ్రీజలేశ్వరాలయం, చింతగట్టు సమీపంలోని బోడగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూములు అన్యాక్రాంతమైనట్టుగా ప్రచారం జరుగుతోంది. ఇలా నగరంలోని ప్రముఖ ఆలయాలకు సంబంధించిన సుమారు 350 ఎకరాల నుంచి 500 ఎకరాల భూములు కబ్జాకు గురైనట్టు అంచనా వేస్తున్నారు. రూ.వేల కోట్ల విలువైన భూములు కబ్జాలకు గురవుతున్నా ప్రభుత్వం దృష్టి సారించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటిలోని ఆలయ భూములకు విముక్తి కల్పించాలని పలువురు కోర్టులో, లోకాయుక్తాలో కేసులు వేశారు.

నగరంలో దేవాదాయశాఖ గుర్తించిన ఆక్రమణలకు గురైన ఆలయ భూములివీ..

ఆలయం	ప్రాంతం	భూములు	కబ్జా భూమి
పద్మాక్షి ఆలయం	హనుమకొండ	72.23ఎకరాలు	8.20ఎకరాలు
సిద్దేశ్వరస్వామి ఆలయం	హనుమకొండ	24.03 ఎకరాలు	0.09ఎకరాలు
ఎర్రగట్టు శ్రీవెంకటేశ్వరస్వామి	హసన్‌పర్తి	12.30ఎకరాలు	3.06ఎకరాలు
శ్రీసీతారామచంద్రస్వామి	మడికొండ	470.34ఎకరాలు	264.34ఎకరాలు
రంగనాయకస్వామి-పెద్దకోవెల	హనుమకొండ	13.34ఎకరాలు	9.13ఎకరాలు
శ్రీజగదీష్ మందిర్	హనుమకొండ	15.21ఎకరాలు	15.21ఎకరాలు
వీరపిచ్చమాంబ పీఠం	హనుమకొండ	1.14ఎకరాలు	0.10ఎకరాలు
శ్రీసీతారామచంద్రస్వామి	రాగన్నదర్వాజ	4.33ఎకరాలు	1.38ఎకరాలు
శ్రీవేణుగోపాలస్వామి ఆలయం	మడికొండ	9.04ఎకరాలు	1.36ఎకరాలు
శ్రీమెట్టు రామలింగేశ్వరస్వామి	మడికొండ	59.07ఎకరాలు	1.39ఎకరాలు
శ్రీమల్లిఖార్జునస్వామి ఆలయం	రామన్నపేట	10.00ఎకరాలు	8.10ఎకరాలు
శ్రీహనుమాన్ గుడి	రంగంపేట	5.38ఎకరాలు	5.38ఎకరాలు
శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం	రామన్నపేట	5.06ఎకరాలు	4.24ఎకరాలు
శ్రీస్వయంభుశంభులింగేశ్వరస్వామి	ఫోర్టు వరంగల్	3.09ఎకరాలు	0.33ఎకరాలు
శ్రీవేణుగోపాలస్వామి ఆలయం	మట్టెవాడ	4.21ఎకరాలు	1.21ఎకరాలు
శ్రీరంగనాయక ఆలయం	దేశాయిపేట	19.19ఎకరాలు	7.35ఎకరాలు
శ్రీసీతారామచంద్రస్వామి గుడి	రంగశాయిపేట	26.29ఎకరాలు	554.15చ.గ.

దేవుడికి భూమి దక్కేదెప్పుడో?

వరంగల్ నగరంలోని ఆలయ భూములు కబ్జాకోరల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయి. కబ్జా భూముల్లో విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లు, వెంచర్లు, అపార్ట్‌మెంట్లు నిర్మించారు. వేల కోట్ల రుపాయల భూములు కబ్జాలకు గురవుతున్నా స్వాధీనం చేసుకునేందుకు దేవాదాయ శాఖ దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా వరకు అక్రమణల్లో బడా బాబులు.. విద్యాసంస్థలు అధిపతులు, వ్యాపార వేత్తలతో పాటు ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించే నేతలు కూడా ఉన్నారు. దీంతో అక్రమ కట్టడాలపై దేవాదాయశాఖ కొరడా ఝుళిపించ లేకపోతుందనే చర్చ జరుగుతోంది. అంతేకాకుండా చాలా వరకు ఆలయ భూములపై కోర్టుల్లో కేసులు, లోకాయుక్తలో ఫిర్యాదులున్నాయి. ఇవన్నీ ఎప్పుడు పరిష్కారమవుతాయో ఎప్పుడు దేవుడికి భూమి దక్కుతుందో అనే ఉత్కంఠలో భక్తులున్నారు. నగరానికి చెందిన ఎమ్మెల్యే కొండా సురేఖ దేవాదాయశాఖ మంత్రిగా ఉండటంతో మహనగరంలోని అక్రమణలకు గురైన దేవాలయాల భూములకు విముక్తి కల్పించేందుకు చొరవ చూపాలని భక్తులు మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నష్టం అంచనాలకు తక్షణమే చర్యలు చేపట్టాలి

● అడవిలో జరిగిన విపత్తును కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్తాం ● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ● ములుగుజిల్లాలో పర్యటన


తాడ్వాయి - మేడారం అడవుల్లో ప్రకృతి విధ్వంసంతో నేలరాలిన చెట్లను పరిశీలిస్తున్న మల్కాజిగిరి ఎంపీ రాజేందర్

తాడ్వాయి, సెప్టెంబరు 6: భారీ వర్షాలతో జరిగిన నష్టంపై అంచనా వేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ అధికారులకు సూచించారు. శుక్రవారం ములుగు జిల్లా వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించిన ఆయన తాడ్వాయి మండలం జలగలంచవాగును పరిశీలించారు. అనంతరం తాడ్వాయి-మేడారం అడవుల్లో ఇటీవల విధ్వంసానికి గురైన అటవీ ప్రాంతాన్ని పరిశీలించి అక్కడి అటవీశాఖ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందలకాలం నాటి భారీ వృక్షాలు సైతం నేల రాలాయని, 500ఎకరాల్లో లక్షకుపైగా చెట్లు నేలరాలి ఉంటాయని భావిస్తున్నట్లు వెల్లడించారు. ఏ జాతి మొక్కలైతే విధ్వంసానికి గురయ్యాయో మళ్లీ ఆజాతి మొక్కలను పెంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. దేశంలో ఎప్పుడూ ఇలాంటి విపత్తు జరగలేదని, ఈవిషయాన్ని కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో జరిగిన విపత్తును దేశం ఒక పార్శ్యంశంగా తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తంచేశారు. వరదల కారణంగా పేదలు, రైతులు నష్ట పోయిన వివరాలను అడిగి తెలుసుకోవడానికి ఈ ప్రాంతాన్ని సందర్శించడం జరిగింద ని అన్నారు. ఈటల వెంట మాజీ ఎంపీలు గరికపాటి మోహన్‌రావు, అజ్మీరా సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, ధర్మారావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా ప్రహ్లాద్, ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నాయకులు బర్తపురం నరేష్, మల్లెల రాంబాబు, సలేందర్, పాపా రావు, సిద్దబోయిన సురేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పొలాల్లో ఇసుక మేటలను ప్రభుత్వమే తొలగింపజేయాలి : ఈటల

గోవిందరావుపేట : భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన వారిని ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటన మాత్రమే చేసిందని, అధికారులతో క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే జరిపించి తక్షణమే సాయాన్ని అందజేయాలని, పొలాల్లో వేసిన ఇసుక మేటలను ప్రభుత్వమే తొలగింపజేయాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. గోవిందరావుపేట మండలంలోని పస్రా శివారులో గుండ్లవాగు వరదకు దెబ్బతిన్న వరిపొలాలను పలువురు బీజేపీ నేతలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. గతంలో గుండ్లవాగు ప్రాజెక్టుకు బుంగ పడటంతో కోతకు గురై, ఇసుక మేటలు వేసి వందలాది ఎకరాలు దెబ్బతిన్నాయని, రూ.5వేల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చుచేసి భూములను సాగుకు యోగ్యంగా మలుచుకుంటే వరదలతో మళ్లీ మేటలు వేశాయని, దీంతో రైతులు తీవ్ర వేదన చెందుతున్నారన్నారు. ఎకరానికి రూ.10 వేల నష్టపరిహారం ఇవ్వడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇసుక మేటలు వేసి, కోతకు గురైన పొలాలను సాగుకు యోగ్యంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుండ్లవాగుకు ఇరువైపులా కరకట్ట నిర్మించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా వరద బాధితులను ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, నాయకులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, అజ్మీరా ప్రహ్లాద్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జినుకుల కృష్ణాకర్‌రావు, శీలమంతుల రవీంద్రాచారి, భరతాపురం నరేష్, తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, కొత్త సుధాకర్‌రెడ్డి, రుద్రారపు సురేష్, జాడి వెంకట్, నామవరపు విజయలక్ష్మీ, కొత్త సురేందర్, నగరపు రమేష్, కర్ర సాంబశివరెడ్డి, చంద జ్యోతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


రైతుతో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

ఉధృత గోదావరిని దాటలేక..

- తెలంగాణలో నిలిచిపోయిన మావోయిస్టులు
- ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్

హైదరాబాద్/చర్ల, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా బలగాల నుంచి తప్పించుకునేందుకు తెలంగాణలోకి వచ్చిన మావోయిస్టులు.. ఇక్కడా గాలింపు తీవ్రం కావడంతో తిరిగివెళ్లే ప్రయత్నం చేశారు. కానీ.. గోదావరి ఉధృతి వారికి అడ్డుగా మారింది. ఫెర్రీ పాయింట్ల వద్ద పోలీస్ నిఘా, కూంబింగ్ ముమ్మరం చేయ టడంతో తప్పించుకునే మార్గం లేకపోయింది. భద్రాది కొత్తగూడెం జిల్లా కరకగూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో బలగాల నుంచి తప్పించుకోవడంతో పాటు తెలంగాణలో పట్టు సాధిం చేందుకు వీరు వేసవిలో గోదావరి నది దాటి వచ్చారు. ఇప్పు డు అదే గోదావరిని అధిగమించలేక ప్రాణాలు కోల్పోయారు.

కాగా, గురువారం నాటి ఎన్‌కౌంటర్‌లో భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు (బీకే-ఏఎస్ఆర్) డివిజన్ కమిటీ సభ్యులు ఆరుగురు మృతిచెందిన సంగతి తెలిసిందే. మణుగూరు లోకల్ గెరిల్లా స్క్వాడ్ (ఎల్జీఎస్) కార్యదర్శి వీరన్న అలియాస్ లచ్చన్న, ఆయన భార్య, మణుగూరు ఎల్జీఎస్ కమాండర్ పూనం లక్కె సహా మరో నలుగురు చనిపోయారు. లచ్చన్న నేతృత్వంలో దళం తెలంగాణలోకి మే నెలలోనే వచ్చింది. బలగాలకు చిక్కకుండా సంచరించింది. అయితే, తెలంగాణ పోలీస్‌లు వారి కదలికలను పక్కాగా పసిగట్టడంతో కరకగూడెం ఎన్‌కౌంటర్ జరిగింది. మరో టవైపు ఈ ఏడాది 6 నెలల్లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో 100 మందిపైగా మృతి చెందారు. 300 మంది లొంగిపోయారు. 250 మంది వరకు అరెస్టయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లో కొంతకాలంగా భద్రతా బలగాలు 'ఆపరేషన్ కగార్' పేరుతో దాడులు చేస్తున్నాయి. ఇటు ఒడిసా, తెలంగాణ, ఏపీలోనూ కట్టుదిట్టం చేయడంతో మావోయిస్టులు తప్పించుకునే వీల్లేకపోతోంది. కేంద్ర హోం శాఖ ఆదేశాలతో అన్ని రాష్ట్రాల పోలీస్‌లు కూంబింగ్‌లతో మావోయిస్టుల స్థావరాలకు చేరువవుతుండడంతో అగ్ర నేతలు సురక్షిత స్థావరాల కోసం చూస్తున్నారు. నారాయణపూర్, బీజాపూర్, కాంకేర్ నుంచి కీలక నేతలు మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్‌తో పాటు తెలంగాణ వైపు వచ్చారన్న సమాచారంతో పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. కేంద్ర కమిటీలో చాలామంది వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందికరంగా మారిన విభేదాలు

తెలుగు రాష్ట్రాలకు చెందిన నీల్సోను ఇన్‌ఫార్మర్ నెపంతో హతమార్చాక.. మావోయిస్టు పార్టీలో విభేదాలు తీవ్రమైనట్లు సమాచారం. దళంలో ఎవరు ఇన్‌ఫార్మర్, ఎవరు కాదు అన్న విషయంలో సందేహాలు నెలకొన్నాయి. రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ సైతం ద్రోహులు ఇచ్చిన సమాచారంతోనే జరిగిందని పార్టీ ప్రకటించింది. తెలంగాణ- ఏపీ కేడర్‌లోనే కోవర్టులు ఎక్కువగా ఉన్నారన్న ప్రచారం ఉంది. అందుకే, వీరిని హిడ్మా తమ గ్రూప్‌తో దూరంగా ఉంచుతున్నారని తెలిసింది. కొద్ది రోజుల కిందట హిడ్మా బెటాలియన్ కేడర్లు కేంద్ర కమిటీ సభ్యుడైన చంద్రన్న టెంట్‌పై రాత్రివేళ దాడి చేసినట్లు సమాచారం. ఓవైపు పోలీసు క్యాంపులు, ఎన్‌కౌంటర్లు, మరోవైపు కేడర్ దూరం అవుతుండడం పార్టీని ఇరకాటంలో నెట్టేస్తున్నాయి.

విడిపోయి పట్టు కోల్పోయి..

విభేదాలు, ఎన్‌కౌంటర్లు, ఇతర పరిణామాలతో కొంత కాలంగా మావోయిస్టులు బృందాలుగా ఏర్పడి సంచరిస్తున్నారనే చర్చ సాగుతోంది. 30 నుంచి 50 మంది బృందాల్లో నేడు 10 మందే ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌కౌంటర్లకు చిక్కుతున్నారని తెలుస్తోంది. కరకగూడెంలో ఏడుగురు, బీజాపూర్, దంతెవాడలో 10-15 మంది సభ్యులే ఉండడం గమనార్హం. ఏప్రిల్‌లో కర్రి గుట్టలపై జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉన్నారు. మావోయిస్టులు జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే బలగాలకు చిక్కుతున్నట్లు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో రెండు రోజుల్లో ఇద్దరు అగ్రనేతలు మృతి చెందారు. వీరిలో పార్టీలోని నాయకులు, సభ్యులకు దిశానిర్దేశం చేసే మొదటి తరం నాయకుడు రణదేవ్ దాదా ఉన్నారు. లచ్చన్న మృతి తెలంగాణలో మావోయిస్టు పార్టీకి కోలుకోని దెబ్బగా చెబుతున్నారు.

తెలంగాణలో అడుగుపెట్టనివ్వతం : డీజీపీ జితేందర్

తెలంగాణలో మావోయిస్టులను అడుగు పెట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని డీజీపీ జితేందర్ తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సీఎం.. ఉట్టి మాటలు కట్టిపెట్టు..

- వరద బాధితులకు ఆర్థిక సాయం అందించాలి
- ఎంపీ ఈటల రాజేందర్

మరిపెడ/మరిపెడ రూరల్, సెప్టెంబరు 6: సీఎం రేవంత్‌రెడ్డి ఉట్టి మాటలు కట్టిపెట్టి.. తక్షణమే వరద బాధితులకు ఆర్థిక సహాయం ఇవ్వాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం సీతారాంతండా ఆకేరు వరదబాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి నిత్యావసర సరకులను అందచేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీతారాంతండావాసులు అర్ధరాత్రి ఉప్పెనలా వచ్చిన ఆకేరు వరదకు ఇళ్లమునిగి సర్వం కోల్పోయారని, కట్టుబట్టలతో మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా ఈ తండాకు వచ్చి బాధితులను పరామర్శించినప్పటికీ, ఒక్క రూపాయి ప్రభుత్వం నుంచి అందివ్వకపోవడం శోచనీయమన్నారు. వరద బాధితులను పరామర్శించి రేవంత్‌రెడ్డి ఉట్టిమాటలు చెప్పి వెళ్లారని ఆరోపించారు. ఇప్పటికైనా బాధితులకు పరిహారం ఇవ్వాలన్నారు. లేకుంటే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని క్షమించరన్నారు. మరిపెడ మండలంలోని భారీ వర్షానికి నష్టపోయిన బీచ్‌రాజ్‌పల్లి, ఉల్లేపల్లి, పురుషోత్తామాయగూడెం, బాల్నిధర్మారం, సీతారాం, భూక్యా తండాల ప్రజలకు బీజేపీ తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈటల వెంట జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్, బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర కన్వీనర్ మార్తినేని ధర్మరావు, మాజీ ఎంపీ సీతారాం నాయక్, జిల్లా పార్టీ అధ్యక్షుడు వైవీ రావు, స్థానిక నేతలు గంగాధర్, లింగంనాయక్, సుధాకర్, భాస్కర్, జనార్దన్ ఉన్నారు. అనంతరం మరిపెడలోని కార్గిల్ స్థూపం దగ్గర అమర జవాన్లకు నివాళులర్పించారు.


బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఈటల రాజేందర్

బొగత సందర్శన పునఃప్రారంభం

వాజేడు, సెప్టెంబరు 6: తెలంగాణ నయాగరా బొగత జలపాతం సందర్శనను శనివారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 31 నుంచి భారీ వర్షాల కారణంగా జలపాతం సందర్శనను ఫారెస్టు అధికారులు నిలిపివేశారు. ఈనేపథ్యంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో తిరిగి పర్యాటకులను సందర్శనకు అనుమతిస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటకులు ఈతకొలనులో దిగేందుకు అనుమతులు లేవని, కేవలం సందర్శనకు మాత్రమే అనుమతి స్తున్నట్లు ఆయన తెలిపారు. బొగత వద్ద ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండటంతో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మక్కలకు మస్తు గిరాకీ

ఏనుమాములలో క్వింటా రూ.3,015 పలికిన ధర

వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 6: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న (మక్క)లకు గిరాకీ పలుకుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మార్కెట్లో మక్కలు క్వింటా ధర రూ.3015 పలికగా గతంలో ఇంత ధర ఎప్పుడూ పలకలేదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. హనుమకొండ జిల్లా నడికుడ మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన సురావు కిషన్‌రావు 116 బస్తాల మక్కలు అమ్మకానికి తీసుకుని రాగా హెచ్‌జీఎల్ అడ్తి ద్వారా వెంకటరమణ ఎంటర్ ప్రైజెస్ క్వింటాకు రూ. 3,015 చొప్పున కొనుగోలు చేశారు. దీంతో రైతు కిషన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో మార్కెట్లో కనీస మద్దతు ధర కూడా పలకలేదని, కానీ ఇప్పుడు ఆశించిన దానికంటే అధికంగా వస్తోందని చెబుతున్నారు. రాష్ట్రంలో చికెన్ వినియోగం పెరిగిపోవడంతో కోళ్ల పెంపకం పెరిగిందని, కోళ్ల దాణా కోసం ఎక్కువగా మొక్కజొన్నలు వినియోగిస్తుండడంతో డిమాండ్ పెరిగిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. అలాగే బిస్కెట్, మద్యం తయారీలో వాడకం, ఇతర ఆహార పదార్థాల తయారీలోనూ వినియోగం పెరుగడం ధరలు పెరుగడానికి కారణమని వ్యాపారులు తెలిపారు.


మార్కెట్‌కు మొక్కజొన్నలను అమ్మకానికి తీసుకువచ్చిన రైతు కిషన్‌రావు

మార్కెట్‌లో మక్కల ధరలు ఇలా..

ధర	2020-21	2021-22	2022-23	2023-24
గరిష్ట	రూ.1,895	రూ.2,551	రూ.2450	రూ.3015
కనిష్ట	రూ.1,285	రూ.1,285	రూ.1000	రూ.1221

వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 6: భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వినాయక చవితి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండుగను జరుపుకోవాలని అన్నారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజలు ఎదుర్కొంటున్న విఘ్నాలు తొలిగిపోయి సుఖసంతోషాలతో, అన్ని విజయాలు సాధించేలా చూడాలని కోరారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 6: ములుగు మండలంలోని చిన్నగుంటూరుపల్లిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవళి 25 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 197 క్యాంపులు నిర్వహించగా 9,158 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని, 965 మంది నుంచి రక్త నమూనాలు సేకరించామని అన్నారు. గ్రామస్థులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. శిబిరంలో వైద్య సిబ్బంది ఉమ, తిరుపతమ్మ, భాస్కర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

మేడారం-తాడ్వాయి అడవుల్లో అధికారుల సర్వే

తాడ్వాయి, సెప్టెంబరు 6: మండలంలోని మేడారం-తాడ్వాయి మార్గమధ్యంలో గల అడవుల్లో జరిగిన విధ్వంసాన్ని అటవీశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 200 మంది అధికారులు క్షుణ్ణంగా చెట్ల వివరాలను సేకరిస్తూ నమోదు చేస్తున్నారు. ఒక బృందంలో నలుగురు సభ్యులు రోజుకు 200 చెట్లు సర్వే చేస్తున్నారు. ఈ సర్వే కార్యక్రమంలో జిల్లాలోని ఎఫ్‌డీవోలు, డీఎఫ్‌వోలు, రేంజ్ ఆఫీసర్లు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, స్ట్రైకింగ్‌ఫోర్స్ సిబ్బందితో పాటు వన్యప్రాణుల విభాగం, వైల్డ్‌లైఫ్‌కు సంబంధించిన అధికారులు సైతం పాల్గొంటున్నారు. మరో పది రోజుల వరకు సర్వే కొనసాగే అవకాశం ఉంది. ప్రతి రోజు ఎప్పటికప్పుడు సర్వే వివరాలను నమోదు చేస్తూ జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి అధికారులకు సమాచారం అందజేస్తున్నారు.

కల్లుగీత కార్మికులు హక్కుల కోసం పోరాడాలి

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 6: కల్లుగీత కార్మికులు బైరు మల్లయ్య గౌడ్ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం పోరాడాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, కారుపోతుల యాదగిరిగౌడ్ పిలుపునిచ్చారు. ములుగులోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం బైరి మల్లయ్య నాలుగవ వర్ధంతి కార్యక్రమం జరగగా వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూస్వాముల భూముల్లో ఉన్న తాటిచెట్లు ఎక్కేందుకు మల్లయ్యగౌడ్ అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గుండెబోయిన రవి, బుర్ర శ్రీనివాస్, కూనూరు సాగర్, మునినపల్లి కుమార్,అశోక్, ప్రకాష్, భిక్షపతి, రాజేందర్, జనగాం శ్రీనివాస్, సదానందం, నాగరాజు, రాజు, తిరుపతి పాల్గొన్నారు.

జంపన్నవాగుకు కొనసాగుతున్న వరద ఉధృతి

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 6: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జంపన్న వాగుకు వరద ఉధృతి కొనసాగుతోంది. మండలంలోని దొడ్ల-మల్యాల గ్రామాల మధ్య గల జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మల్యాల, కొండాయి, కొత్తూరు, గోవిందరాజుల కాలనీలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజల సౌకర్యార్థం అధికారులు రెండు పడవలను ఏర్పాటు చేసినప్పటికీ ఇక్కట్లు తప్పడం లేదు. అదేవిధంగా బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాల మధ్య గల జంపన్నవాగుకు ఉధృతి కొనసాగుతుండడంతో వారం రోజులుగా ఎలిశెట్టిపల్లికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వాగుపై ఏర్పాటు చేసిన పడవ ద్వారా నిత్యావసర సరుకుల కోసం గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. వాగు ఉధృతి తగ్గకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎలిశెట్టిపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

టేకుమట్ల, సెప్టెంబరు 6: మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన ఉద్దమారి తిరుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆ కుటుంబానికి కంపెనీ యాజమాన్యం రూ.4.45లక్షల ఆర్థిక సాయం అందజేసింది. తిరుపతి ఓ ప్రయివేటు సీడ్స్ కంపెనీలో పని చేసేవాడు. ఇటీవల విధులకు హాజరై తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మొగుళ్లపల్లి మండల కేంద్రం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా, తిరుపతి పనిచేసిన కంపెనీ యాజమాన్యం, తోటి ఉద్యోగులు కలిసి అతని కూతురు ఆద్యశ్రీ పేరుపై బ్యాంకులో రూ.4.45లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, అదనపు ఖర్చుల నిమిత్తం కుటుంబానికి రూ.30వేలు అందజేశారు.

అత్యాచారం చేసిన నిందితుడిని శిక్షించాలని ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న ఆదివాసీ మహిళా, విద్యార్థి నాయకులు

ఏటూరునాగారం, సెప్టెంబరు 6: ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలో ఆదివాసీ మహిళపై అత్యాచారం చేసి పాశవికంగా దాడి చేసిన నిందితుడు ముగ్దంను కఠినంగా శిక్షించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) రాష్ట్ర కోకన్వీనర్ ఆలం కిషోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ ఆదివాసీ మహిళా సంఘం, ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ సమాజంలో ఆదివాసీలు అనేక రకాల దోపిడీకి గురవుతున్నారన్నారు. దేశంలో అత్యంత క్రూరంగా అణచి వేయబడేది ఆదివాసీలేనని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యాచారం, హత్యాయత్నం చేసిన నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా తక్షణమే కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు పూలిసె బాలకృష్ణ, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దబ్బకట్ల శ్రీకాంత్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గావిడి నాగబాబు, ఆదివాసీ మహిళా సంఘం బడే సులోచన, ఈసం స్వరూప, బొల్లం సారయ్య, పాయం భారతమ్మ, జాక సమ్మక్క, చంద్రమణి, గుంటి సరోజన, పలక ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

సూరవీడు ర్యాంప్ వద్ద లారీ డ్రైవర్ల ధర్నా

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 6: మండలంలోని సూరవీడు ఇసుక ర్యాంప్ వద్ద లారీ డ్రైవర్లు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై బైఠాయించి శుక్రవారం ధర్నా నిర్వహించారు. దీంతో రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా లారీ డ్రైవర్లు మాట్లాడుతూ ర్యాంప్‌లో ఇసుక లోడింగ్ కోసం డీడీలు తీసుకుని ర్యాంప్ వద్దకు వచ్చి నాలుగురోజులు దాటిందని ఆవేదన వ్యక్తంచేశారు. నాలుగురోజుల నుంచి లారీల్లో ఇసుక లోడింగ్ కాకపోవడంతో పడిగాపులు కాయాల్సి వస్తుందని అన్నారు. అధికారులు ఇప్పటికైనా ఇసుక లోడింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదుపు తప్పి కల్వర్టు లోయలో పడ్డ ట్రాలీ వాహనం

కృష్ణకాలనీ(భూపాలపల్లి), సెప్టెంబరు 6: భూపాలపల్లి మండలం రాంపూర్ అటవీ ప్రాంతం సమీపంలో అదుపుతప్పిన మహేంద్ర ట్రాలీ వాహనం కల్వర్టు లోయలో పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జనగాం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఉల్లిగడ్డలు విక్రయించేందుకు శుక్రవారం ఉదయం గొల్లబుద్దారం వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో కల్వర్టు సమీపంలో అదుపుతప్పిన వాహనం చెట్టును ఢీకొని లోయలో పడింది. అయితే, ఆ వాహనంలో ఉన్న వ్యక్తి అదృష్టవశాత్తు సురక్షితంగా బయటపడ్డాడు. వాహనం స్వల్పంగా దెబ్బతింది.

బొల్లారం చెరువుకు బుంగ

వాజేడు, సెప్టెంబరు 6 : మండలంలోని బొల్లారం చెరువుకు శుక్రవారం బుంగ పడింది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు కట్టకు ఒక ప్రాంతంలో బుంగ పడి నీరు వృథాగా పోతుంది. మరో భారీ వర్షం పడితే గండి పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. చెరువు కింద బొల్లారం గ్రామంతో పాటు, సుమారు 40 ఎకరాలు వరి సాగు చేస్తున్నారు. గండి పడితే గ్రామంకు ప్రమాదం పొంచి ఉందని, పొలాలు కూడా మునిగిపోయే ఆస్కారం ఉందని స్థానికులు వాపోతున్నారు. కాగా, బుంగ పడిన ప్రదేశాన్ని తహసీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ రాహుల్ చంద్రవర్మ, ఆర్ఐ కుమారస్వామిలు స్థానికులతో కలిసి పరిశీలించారు. బుంగను పూడ్చేందుకు ఇసుక బస్తాలను అధికారులు సిద్ధం చేశారు. బుంగ పూడ్చేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం : సీడీపీవో

ఏటూరునాగారం, సెప్టెంబరు 6: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో ప్రేమలత అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ నేతాజీ నగర్ పాఠశాలలో పోషణ మాసంను పురస్కరించుకొని మహిళలకు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన పోషకారంపై అవగాహన కల్పించారు. మహిళలు కిశోర బాలికలు రక్త హీనతపై బాలింతలకు, గర్భిణులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ పాఠశాలల పిల్లలు పాల్గొన్నారు.

లెక్క తేలుస్తున్నారు..

- ఒక్కొక్కరి పేరుపై రెండు క్వార్టర్లు
- కిరాయి ఇచ్చిన వారికి నోటీసులు

కాకతీయఖని, సెప్టెంబరు 6: క్వార్టర్ల కేటాయింపుల్లో అవకతవకలను 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక వెలికి తీయడంతో సింగరేణిలో ప్రకంపనలు రేపింది. దీంతో ప్రస్తుత జీఎం హబీబ్ హుస్సేన్ పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో సెక్యూరిటీ సిబ్బందిని మూడు బృందాలుగా ఏర్పాటు చేసి ఇంటింటి సర్వే చేయిస్తున్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో క్వార్టర్ల కేటాయింపు, బకాయిల చెల్లింపుపై సమగ్ర కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈక్రమంలో అక్రమార్కుల లెక్క తేల్చేందుకు జీఎం పూనుకోవడంతో అక్రమ పద్ధతిలో హెచ్‌ఆర్‌ఏ తీసుకున్న, క్వార్టర్లు కిరాయికి ఇచ్చిన వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

సింగరేణి భూపాలపల్లి ఏరియాలో గందరగోళంగా మారిన క్వార్టర్ల లెక్కను అధికారులు తేలుస్తున్నారు. ఇప్పటికే ఆరుగురు సెక్యూరిటీ సిబ్బందిని మూడు బృందాలుగా ఏర్పాటు చేసి ఏ క్వార్టర్‌లో ఎవరుంటున్నారనే వివరాలను తెలుసుకుంటున్నారు. గత నెల రోజులుగా వారు ఒక్కోక్వార్టర్ తిరిగి వివరాలను తెలుసుకుంటుంటే నమ్మలేని నిజాలు వెలుగులోకి వస్తున్నాయని సింగరేణి అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో కార్మికుడి పేరు మీద రెండు క్వార్టర్లు అలాట్ అయి ఉన్నాయని, దిగిపోయిన కార్మికులు కొందరు వాటిని తమకు అప్పగించలేదని, మరికొందరు క్వార్టర్‌ను ఇతరులకు కిరాయికి ఇస్తున్నారని, యాజమాన్యం క్వార్టర్ కేటాయించినప్పటికీ హెచ్‌ఆర్‌ఏ తీసుకుంటున్నారని అధికారులు చెబుతున్నారు. అయితే ఇదంతా అధికారుల కళ్లకు కనిపించలేదా.. అని పలు కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

ఒక్కొక్కరి పేరుపై రెండు క్వార్టర్లు

భూపాలపల్లి ఏరియాలో సుమారు 5,400 మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరు కుటుంబంతో కలిసి నివసించేందుకు సింగరేణి యాజమాన్యం 4,751 క్వార్టర్లు నిర్మించింది. అయితే ఏరియా అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి కార్మికులకు వాటిని కేటాయించారు. వాటిలో 42 మంది కార్మికుల పేరుపై రెండు క్వార్టర్లు కేటాయించి ఉన్నట్లు సెక్యూరిటీ సిబ్బంది గుర్తించిందని, ఇంకా లెక్క పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వారికి నోటీసులు పంపిస్తున్నామని, వారి నుంచి పీనల్ రెంట్ వసూలు చేస్తామని అంటున్నారు. అలాగే యాజమాన్యం కార్మికులకు క్వార్టర్ ఇచ్చినప్పటికీ ఏరియాలో పనిచేస్తున్న 28 మంది కార్మికులు హెచ్‌ఆర్‌ఏ తీసుకుంటున్నట్లు సింగరేణి పర్సనల్ అధికారులు గుర్తించారు. వారి నుంచి రూ.11లక్షలు రికవరీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు, ఇప్పటికే కొంత మంది నుంచి రూ.5 లక్షలు రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు.

కౌన్సిలింగ్ లేకుండా అలాట్‌మెంట్



భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి క్వార్టర్లు

సింగరేణి క్వార్టర్లను కార్మికులకు కేటాయించాలంటే కౌన్సిలింగ్ నిర్వహించాలి. అయితే 2022, 2023 సంవత్సరంలో సుమారు 40 క్వార్టర్లను కౌన్సిలింగ్ నిర్వహించకుండా స్పెషల్ అలాట్‌మెంట్ పవర్‌ను వినియోగించి కార్మికులకు కేటాయించారనే ఆరోపణలు ఏరియాలో వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్‌ను అడగగా వాటి గురించి ఇప్పుడే చెప్పలేనన్నారు.

తాను చార్జ్ తీసుకున్న నాటి నుంచి కేవలం ఒకే క్వార్టర్ బర్ల నారాయణ అనే కార్మికుడికి కంపెనీ నిబంధనల ప్రకారమే ఇచ్చానని తెలిపారు. అయితే కౌన్సిలింగ్ నిర్వహించకుండా కేటాయించిన క్వార్టర్లపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమాలను సహించేది లేదు

హబీబ్ హుస్సేన్, జీఎం సింగరేణి భూపాలపల్లి ఏరియా



సింగరేణి క్వార్టర్లలో జరుగుతున్న అవకతవకలను సరిచేసేందుకు సెక్యూరిటీ సిబ్బందితో విచారిస్తున్నాం. ప్రస్తుతం 219 క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. వీటికి త్వరలోనే కౌన్సిలింగ్ నిర్వహిస్తాం. ఒక్కొక్కరి పేరుపై డబుల్ క్వార్టర్లు ఉన్న వారిని సుమారు 42 మందిని గుర్తించాం. ఇంకా పెరిగే అవకాశం ఉంది. వారి నుంచి పీనల్ రెంట్ వసూలు చేస్తున్నాం. క్వార్టర్ ఉండి హెచ్ ఆర్‌ఏ తీసుకుంటున్న వారిని 28మందిని గుర్తించి రూ.10,87,000 రికవరీ పెట్టాం. ఇప్పటికే పలువురి వద్ద నుంచి రూ.5లక్షలు రికవరీ చేశాం. క్వార్టర్ కిరాయికి ఇచ్చిన వారిని గుర్తిస్తున్నాం. ప్రస్తుతం గుర్తించిన సుమారు 150 మంది కార్మికులకు నోటీసులు పంపించాం.

సబ్ కలెక్టర్‌గా మయాంక్‌సింగ్ బాధ్యతలు



సబ్‌కలెక్టర్‌ను శాలువాతో సన్మానించిన మండల అధికారులు

కాటారం, సెప్టెంబరు 6: కాటారం సబ్‌కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి మయాం క్‌సింగ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండల కేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం కాటారం రెవెన్యూ డివిజన్‌ను సబ్ కలెక్టర్ కార్యాలయం హోదాగా అప్‌గ్రేడ్ చేసి 2022 ట్రైనీ బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన మయాంక్‌సింగ్‌ను సబ్ కలెక్టర్‌గా నియమించింది. దీంతో ఆయన తన కార్యాలయంలో విధుల్లోకి చేరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి డివిజన్ నైసర్గిక స్వరూపం తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో పాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది చేపట్టాల్సిన విధి నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు బాధ్యతలు స్వీకరించడానికి కార్యాలయానికి వచ్చిన సబ్‌కలెక్టర్‌కు అధికారులు ఘన స్వాగతం పలికారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన అధికారులు

కాటారం డివిజన్ సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి మయాంక్ సింగ్‌ను పలువురు డివిజన్, మండల స్థాయి అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. బొకేలు అందించి శాలువాలతో సన్మానించి స్వాగతం తెలిపారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో కాటారం డీఎస్పీ గడ్డం రాంమోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, కాటారం, మల్హర్‌రావు, పలిమెల తహసీల్దార్లు నాగరాజు, రవికుమార్, అనిల్, కాటారం ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో వీరస్వామి, ఆర్ఐ వెంకన్న, కాటారం కార్యదర్శి సమీర్‌ఖాన్ పలువురు కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎంపీ ఈటల సాయం

మేడారం, సెప్టెంబరు 6: తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన పశువుల కాపరి మహేష్ కుటుంబాన్ని ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మేడారం పర్యటనలో భాగంగా ముంపు ప్రాంతాలను పరిశీలిస్తూ నార్లాపూర్ గ్రామంలోని మహేష్ కుటుంబాన్ని కలిసి ఓదార్చారు. అనంతరం ఆయన ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆకుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 24ఏళ్లలోనే మృత్యువు ఒడిలోకి చేరడం దురదృష్టకరమన్నారు. ప్రకృతి వైపరీత్యాలను అంచనా వేయలేని రైతులు, కూలీలు, పశువుల కాపరులు పిడుగు పాటుకు బలవుతున్నారని అన్నారు. వారికి ప్రభుత్వం వెంటనే ప్రత్యేక నష్టపరిహారాన్ని అందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, ములుగు జిల్లా ఇన్ చార్జ్ ప్రహ్లాద్, బీజేపీ జిల్లా, మండల నాయకులు, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా ఉపాధి పనులు చేపట్టాలి

- అదనపు డీఆర్డీవో వసుమతి

చిట్యాల, సెప్టెంబరు 6: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు చోటు చేసుకోకుండా మండల అధికారులు పర్యవేక్షణ చేయాలని అదనపు డీఆర్డీవో వసుమతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 15 విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం ముగిసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై రెండు రోజులపాటు మండల ప్రజావేదిక కొనసాగింది. ఈ సందర్భంగా వసుమతి మాట్లాడారు. పని ప్రదేశాల్లో కొలతల్లో తేడాలు, జాబ్ కార్డుల్లో అవకతవకలు, మస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పనులకు రాని వారి ఖాతాల్లో డబ్బులు జమ కావడం లాంటి సమస్యలు ఎక్కువగా రావడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, సీనియర్ మేట్లను బాధ్యులుగా చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. చిట్యాల జీపీలో రూ.1,08,000, ఒడితల రూ.95,347, బావుసింగ్‌పల్లి రూ.72,805,



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో వసుమతి

జూకల్లు రూ.33,828, నైన్‌పాక రూ.33,873, నవాబుపేట రూ.30,003 వీటితో పాటు 25 గ్రామ పంచాయతీల అధికారులు, సిబ్బందికి మొత్తం రూ.4,75,851 రికవరీ, జరిమానా విధించినట్లు తెలిపారు. పొరపాట్లు పునరావృతం కాకుండా అధికారులు, సిబ్బంది ఉపాధి హామీ పనులు జరిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ధరమ్‌సింగ్, రుబీనా, శ్రీనివాస్, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో అలీం, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం, సెప్టెంబరు 6: కాటారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)లో 2024-2025 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భిక్షపతి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లో నాల్గో విడత ప్రవేశాలకు 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిట్టర్ విభాగంలో 5సీట్లు, ఎలక్ట్రీషియన్-3, డీఎం సివిల్-24, కోపా విభాగంలో 17 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు దరఖాస్తు చేసుకొని వెబ్‌సైట్‌లో నిజధృవీకరణ పత్రాలు(ఒరిజినల్ సర్టిఫికెట్స్)అప్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఏటూరునాగారం, సెప్టెంబరు 6: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు గడువును ఈనెల 30 వరకు పొడిగించినట్లు ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రేణుక తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. www.brou.online.in, www. ac.in వెబ్‌సైట్లలో పొందొచ్చన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించని వారు కూడా చెల్లించాలన్నారు. సందేహాలకు ఏటూరునాగారంలోని ప్రభుత్వడిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు. సందేహాలుంటే 7382929825, 9491317887, 8500178217 నంబర్లలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీ చోరీ

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 6: మండలంలోని బీసీమర్రిగూడెం పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీ చోరీకి గురైంది. ఈవిషయంపై పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రవీణ్ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతనెలలో మార్కెట్‌యార్డు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి ట్రాలీని తీసుకెళ్లి అక్కడే ఉంచినట్లు పేర్కొన్నారు. కాగా, ఇటీవల ట్రాలీ కోసం వెళ్లి చూడగా కనిపించలేదని అన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం

- మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 6: ఇటీవల సంభవించిన వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్ అన్నారు. శుక్రవారం వరద ముంపు గ్రామాలైన రాంపూర్, ముల్లకట్ట గ్రామాల్లో ఎంపీ పర్యటించి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. భారీ వర్షాలకు వాగులు, వంకల ఉధృతి కారణంగా పలు గిరిజన గ్రామాలకు వరదలు సంభవించాయన్నారు. వరద వల్ల అనేక మంది ప్రజలు అవస్థలు పడుతున్నారని, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంపీ తెలిపారు. ఏటూరునాగారం, తాడ్వాయి మంగపేట, కన్నాయిగూడెం తదితర మండలాల్లో పలు గ్రామాలకు వరద వల్ల నష్టం జరిగిందని, నష్టాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారికి నష్టపరిహారం అందిస్తామని ఎంపీ హామీనిచ్చారు. ఏజెన్సీ ప్రజల సౌకర్యార్థం రూ.5కోట్లను తక్షణమే ప్రకటించేలా సీఎంతో మాట్లాడడం జరుగుతుందన్నారు. నష్టపోయిన వారికి రూ.10వేలు అందేలా కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. అంతేకాకుండా గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారని, గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేశామని ఎంపీ తెలిపారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలు అధైర్యపడొద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

కలెక్టర్‌ను కలిసిన సబ్ కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 6 : కలెక్టర్ రాహుల్‌శర్మను కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసిన మయాంక్‌సింగ్ ఆయనకు మొక్కను అందజేశారు.

శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలి

- భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు



మండపాల నిర్వాహకులకు సూచనలు చేస్తున్న సంపత్‌రావు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), సెప్టెంబరు 6: నవరాత్రి వినాయక చవితి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు సూచించారు. శుక్రవారం రాణా ఆవరణలో పట్టణంలోని మండపాల నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా విగ్రహం ఏర్పాటు చేసేవారంతా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. మండపాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గండదీపం పెట్టినప్పుడు నిరంతరం గమనిస్తూ ఉండాలని సూచించారు. మండపం ఏర్పాటుతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఉండవద్దని, రోడ్డును పూర్తిగా బ్లాక్ చేయొద్దని అన్నారు. ఏదైన ఇబ్బందులు తలెత్తితే నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, ఉదయం, సాయంత్రం వేళల్లో కేవలం భక్తి పాటలను మాత్రమే పెట్టాలని, సినిమా పాటలతో హంగామ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, ఎస్సై సుధాకర్, మహిళా ఎస్సైలు సంధ్యారాణి, స్వప్నకుమారి, సిబ్బందితో పాటు మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కాటారం : గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ గడ్డం రామ్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కాటారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయక మండపాల కమిటీ సభ్యులతో పోలీసులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు ఆన్లైన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద అల్లర్లు, అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత కమిటీ ప్రతినిధులదేనన్నారు. నిమజ్జనం రోజున త్వరగా వెళ్లి సంబంధిత జలవనరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలన్నారు. సమావేశంలో సీఐ నాగార్జునరావు, ఎస్సై మ్యాక అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు సహకరించాలి

మంగపేట, సెప్టెంబరు 6: క్షయవ్యాధి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చుంచుపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి యమున సూచించారు. శుక్రవారం మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీలో క్షయవ్యాధిగ్రస్తులకు నిర్ధాణ పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. వారి కిపాటించాల్సిన నిబంధనలను వివరించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో క్షయవ్యాధి నివారణ కోసం ప్రమాణం చేయించారు.

కొంపెల్లిలో మురికి కాల్వల శుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 6: భూపాలపల్లి మండలంలోని కొంపెల్లి గ్రామంలో అధికారులు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'అస్తవ్యస్తం.. అధ్వానం' అనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో కలెక్టర్ రాహుల్ శర్మ పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో కొంపెల్లిలో కార్యదర్శి, కారోబార్ నేతృత్వంలో నిండిపోయిన డ్రైనేజీని పారిశుధ్య కార్మికులచే శుభ్రం చేయించారు.జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది.

ప్రైవేటు ల్యాబ్‌లు, క్లినిక్‌ల తనిఖీ

వాజేడు, సెప్టెంబరు 6: మండలంలోని పేరూరు పీహెచ్‌సీ పరిధిలోని ధర్మవరం, పేరూరులో ప్రైవేటు ల్యాబ్‌లు, క్లినిక్‌లను శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కోరం క్రాంతి తనిఖీ చేశారు. క్లినిక్‌లలో రోగులకు పరిమితి మించి వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఆర్‌ఎంపీలు ఎక్కువ మోతాదులో స్టెరాయిడ్స్, ఎంటిబయోటిక్స్‌ను వాడితే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. రోగుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అయన ధర్మవరంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పాల్గొన్నారు. ఇంటి పరిసరాలలో నిల్వ ఉన్న నీటిని గుర్తించి పారబోశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట పేరూరు వైద్యాధికారి రాహీల్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా వైద్య శిబిరాలు

మంగపేట, సెప్టెంబరు, 6: మండలంలోని చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల రమణక్కపేట, విజయరావుపేట, వెంకటగిరిపేట, రాజుపేట, ఉప్పరకాలనీలలో వైద్యాధికారులు కారం నిఖిల్‌కుమార్, యమున ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలను నిర్వహించారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేసి రక్త నమూనాలను చేయించి డ్రైడేను నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడళ్లలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. 1100 మందికి మందులను అందజేసి 91 మందికి వైరల్ ఫీవర్, 30 మందికి మలేరియా, తదితర అంటువ్యాధులతో బాధపడుతున్న వారికి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్స్ ఆయాలు పాల్గొన్నారు.

100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

(5వ పేజీ తరువాయి)

వాహనం అనుమానాస్పదంగా కనిపించిందన్నారు. వాహనాన్ని ఆపి పరిశీలించగా 100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమయ్యాయన్నారు. దీంతో వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తాను పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన మేకల శివకృష్ణ గత కొంతకాలంగా తన ఓనర్ అయిన రేగొండ మండలం జగ్గయ్యపల్లికి చెందిన మిడిమిళ్ల దేవేందర్‌గౌడ్‌తో కలిసి రేగొండ మండలం కోటంచ, ఇతరత్రా సమీప గ్రామాల్లో తక్కువ ధరకు పేదల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి మహారాష్ట్రలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్‌కుమార్ స్పష్టం చేశారు.

ప్రతిభ చూపండి.. లక్షలు గెలవండి..

మహదేవపూర్, సెప్టెంబరు 6 : ప్రతిభ చూపండి.. లక్షలు గెలవండి.. అని రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా 90 ఏళ్లుగా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్బీఐ తెలంగాణ డిప్యూటీ జనరల్ మేనేజర్ జగదీష్ అన్నారు. మహదేవపూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ చదివే విద్యార్థినీ విద్యార్థులు డబ్ల్యూ.డబ్ల్యూడబ్ల్యూ ఆర్‌బీఐ 90 క్విజ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 17 వరకు పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో బ్యాంకు వ్యవస్థపై బాధ్యతాయుతంగా ఉండడం, డిజిటల్ లావాదేవీలు, సురక్షితం వంటి అంశాలను ప్రోత్సహించాలనే ఆలోచనతో ఆర్‌బీఐ ఈ క్విజ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.1.5 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.లక్ష, జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతికి రూ.10లక్షల ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమం కామర్స్ విభాగం డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో జరుగగా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, రాజు, రమేష్, రవీందర్, మున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న షర్మిల

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 6 : మండలంలోని గంపోనిపల్లి ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు చల్లా షర్మిల గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డు అందుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డిల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు షర్మిల తెలిపారు. కాగా, షర్మిల ఇటీవల జరిగిన బదిలీల్లో నూగూరు వెంకటాపూర్ మండలంలోని అలుబాకకు పదోన్నతిపై వెళ్లారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 6 : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన గుండెల్లి రాజయ్యను శుక్రవారం మొగుళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. రాజయ్య వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా హైదరాబాద్‌కు వెళ్లి అవార్డు తీసుకోలేకపోయారు. తను విధులు నిర్వర్తిం చే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు తన స్వగృహంలో రాష్ట్ర ప్రభుత్వం సత్కారం, మెమొంటో, ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్, మండల అధ్యక్షుడు నాగరాజు, మొగుళ్లపల్లి, మొట్లపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యథావిధిగా అంతర్ రాష్ట్ర రాకపోకలు

వాజేడు, సెప్టెంబరు 6: తెలంగాణ-ఛత్తీస్‌గడ్‌కు శుక్రవారం ఉదయం నుంచి యథావిధిగా రాకపోకలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి గోదావరి పెరుగుదలతో రేగుమాగు గండి వరద ఉధృతి పెరిగి 163వ జాతీయ రహదారి మండలంలోని టేకులగూడెం వద్ద రహదారిని వరద నీరు ముంచెత్తింది. దీంతో రాత్రి నుంచి రాకపోకలు నిలిచిపోగా పోలీసులు, రెవెన్యూ అధికారులు వాగును దాటకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం వాగు ఉధృతి తగ్గడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి.

అన్నారం బ్యారేజీలో మళ్లీ శాస్త్రవేత్తల అధ్యయనం

మహదేవపూర్, సెప్టెంబరు 6: కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం బ్యారేజీ వద్ద ఇద్దరు శాస్త్రవేత్తలు మరోసారి గోదావరి వరద ప్రవాహాన్ని శుక్రవారం అంచనా వేశారు. ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాల మేరకు సెంట్రల్ పవర్ రీసెర్చ్ స్టేషన్ పూణేకు చెందిన శాస్త్రవేత్తలు సంపత్, నాగరాజు శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీకి చేరుకున్నారు. బ్యారేజీ అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్‌లో గోదావరి ప్రవాహాన్ని అధ్యయనం చేశారు. నాటు పడవ ద్వారా ఏడీసీపీ పరీక్షలు ఆధునిక పద్ధతిలో పరికరాలను ఉపయోగిస్తూ అధ్యయనం చేశారు. నాటు పడవలో తిరుగుతూ బ్యారేజీని పరిశీలించారు. కాగా, 15 రోజుల క్రితం మూడు రోజుల పాటు పూణేకు చెందిన శాస్త్రవేత్తలు మొదటి విడత అన్నారం బ్యారేజీపై అధ్యయనం చేసిన విషయం తెలిసిందే. అలాగే మేడిగడ్డ బ్యారేజీని ఈ ఇద్దరు శాస్త్రవేత్తలు శనివారం సందర్శించి అధ్యయనం చేయనున్నట్లు తెలిసింది.